# సాక్షి
## అనంతపురం

ఆదివారం । 22 । జూన్ । 2025




**చీనీ టన్ను రూ.25,670**

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.25,670 పలికాయి.



**తక్కువ జీతం.. ఎక్కువ దూరం**

మినిమం టైం స్కేల్ టీచర్ల బాధలు వర్ణనాతీతంగా మారాయి.. ప్రభుత్వం దయ చూపకుంటే కౌన్సెలింగ్ ప్రక్రియను బాయ్‌కాట్ చేస్తామని చెబుతున్నారు. 8లో

గరిష్టం/కనిష్టం
36.4°/24.4°

జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. గాలివేగం పెరిగింది. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 8 నుంచి 16 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

# ఆశల ఆరుద్ర ఆగమనం

వ్యవసాయ పంచాంగం ప్రకారం రైతులకు ఎంతో ఇష్టమైన ఆరుద్ర కార్తె ఆదివారం నుంచి మొదలు కానుంది. ఈ కార్తెలో భూమిలో విత్తనం పడితే బంగారు పంటలు పండుతాయని రైతుల నమ్మకం. ఆరుద్ర రాగానే పొలంబాట పట్టడానికి అన్నదాతలు ఎంతగానో ఆసక్తి చూపిస్తారు.

- నేటి నుంచి 'ముంగారు' పంటలు విత్తుకునేందుకు సరైన సమయం
- ప్రభావం చూపని 'నైరుతి'... 15 మండలాల్లో తక్కువగా వర్షపాతం
- ఆరుద్రతో పాటు పునర్వసు, పుష్యమి కార్తెలు ఏరువాకకు అదను
- కరుణించని కూటమి... సుఖీభవ, బీమా, ఇన్‌పుట్‌పై కొరవడిన స్పష్టత



**అనంతపురం అగ్రికల్చర్:** ఖరీఫ్‌లో పంటలు విత్తుకునేందుకు ఆరుద్ర కార్తెతో పాటు జూలై 6న మొదలయ్యే పునర్వసు, 20న మొదలయ్యే పుష్యమి కూడా అదనుగా చెబుతారు. అయితే ఆరుద్ర, పునర్వసులో విత్తనం పడితే పంట చేతికొస్తుందని రైతుల విశ్వాసం. వర్షాలు ఆలస్యమైతే పుష్యమిలో వేసుకోవచ్చని, పుష్యమి తర్వాత వచ్చే ఆశ్లేష కార్తెలో ప్రధాన పంటలు వేసుకోకపోవడం మేలని చెబుతారు. శాస్త్రవేత్తలు, అధికారులు కూడా జూన్ 15 నుంచి జూలై 15 వరకు ఖరీఫ్‌కు మంచి సమయమని, వర్షాలు ఆలస్యమైతే జూలై ఆఖరు వరకు సాగుకు అనుకూలమని ఇప్పటికే ప్రకటించారు. ఆగస్టు, సెప్టెంబర్‌లో అయితే ప్రత్యామ్నాయ పంటలే శరణ్యమని చెబుతున్నారు.

**ప్రభావం చూపని 'నైరుతి'**

ఆశల 'నైరుతి' ఈ సారి ముందస్తుగానే అంటే మే 26న పలకరించింది. నైరుతి ప్రవేశానికి ముందే జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడటంతో అన్నదాత సంబరపడ్డాడు. అయితే రుతుపవనాలు పెద్దగా ప్రభావం చూపలేదు. అడపాదడపా మినహా ఎక్కడా భారీ వర్షాలు కురవలేదు. జూన్ సాధారణ వర్షపాతం 61 మి.మీ కాగా ఇప్పటి వరకు 42.3 మి.మీ వర్షపాతం నమోదైంది. 15 మండలాల్లో మోస్తరుగా వర్షాలు పడటంతో పదును అయ్యింది. అక్కడక్కడా ఏరువాక సాగిస్తున్నారు. మరో 15 మండలాల్లో వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. పెద్దవడుగూరు, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు, యాడికి, పెద్దపప్పూరు, గుమ్మఘట్ట, కూడేరు, డి.హీరేహాళ్, శింగనమల,పుట్లూరు, యల్లనూరు, నార్పల, అనంతపురం, రాప్తాడు తదితర మండలాల్లో ఇప్పటివరకు పెద్దగా వర్షపాతం నమోదు కాలేదు. కేవలం ఈనెల 8న, 11న వర్షపు రోజులు (రెయినీడేస్) నమోదయ్యాయి. ఆదివారం నుంచి ఆరుద్ర కార్తె మొదలు కావడంతో మరో మంచి వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. పంటల సాగు కోసం తమ పొలాలను సిద్ధం చేసుకుంటున్నారు.

**4.38 లక్షల హెక్టార్ల అంచనా..**

ఖరీఫ్‌లో వర్షాధారంగా 3,06,450 హెక్టార్లు, నీటి వసతి కింద 1,32,321 హెక్టార్లు, మొత్తంగా 4.38 లక్షల హెక్టార్ల భారీ విస్తీర్ణంలో పంటలు సాగులోకి రావొచ్చని అంచనా వేశారు. 1.82 లక్షల హెక్టార్లలో వేరుశనగ,55 వేల హెక్టార్లలో కంది,44 వేల హెక్టార్లలో పత్తి, 16 వేల హెక్టార్లలో ఆముదం, 15 వేల హెక్టార్లలో మొక్కజొన్న సాగు అంచనా వేశారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు నాలుగు నెలల కాలంలో 319.6 మి.మీ వర్షపాతం నమోదుకావాల్సి ఉంటుంది. జూన్‌లో 61 మి.మీ, జూలైలో 63.9, ఆగస్టులో 83.8, సెప్టెంబర్‌లో 110.9 మి.మీ వర్షపాతం నమోదైతే ఢోకా ఉండదని చెబుతున్నారు.

**కరుణించని 'కూటమి'..**

చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా రైతులపై కరుణ చూపించడం లేదు. ఈ ఏడాదిలో పైసా విదల్చలేదు. రూ.500 కోట్ల నుంచి రూ.600 కోట్లు ఇవ్వకుండా రైతులను మోసం చేసింది. అదిగో ఇదిగో 'అన్నదాత సుఖీభవ' అంటూ ఊరిస్తున్నా సొమ్ము విడుదల చేయలేదు. గతేడాదికి సంబంధించి పంటల బీమా పరిహారం గురించి అతీగతీ లేదు. కరువు మండలాలు, పంట నష్టానికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీపై పట్టించుకోకపోవడం గమనార్హం. పథకాలను గాలికి వదిలేయడంతో అన్నదాత పరిస్థితి దారుణంగా మారింది. అరకొరగా విత్తన వేరుశనగ అందించి చేతులు దులుపుకుంటున్న కూటమి సర్కారు తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

## పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



అనంతపురం పాలిటెక్నిక్ కళాశాలలో కౌన్సెలింగ్ హాజరైన విద్యార్థులు

**అనంతపురం:** పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభమైంది. శనివారం ఉమ్మడి జిల్లాలోని అనంతపురం, కళ్యాణదుర్గం, తాడిపత్రి, హిందూపురం మహిళా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో కౌన్సెలింగ్ నిర్వహించారు. తొలిరోజు 1 నుంచి 15 వేల ర్యాంకు వరకు ధ్రువ పత్రాల పరిశీలన ప్రక్రియ చేపట్టినట్లు అనంతపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ సి.జయచంద్రారెడ్డి తెలిపారు. మొత్తం 161 మంది కౌన్సెలింగ్‌కు హాజరైనట్లు పేర్కొన్నారు.

**మరిన్ని వివరాలిలా..**

28వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుంది. జూన్ 25 నుంచి 30 వరకు(25,26 తేదీల్లో 1-50,000 ర్యాంకు వరకూ, 27,28 తేదీల్లో 50,001-90,000 ర్యాంకు, 29,30 తేదీల్లో 90,001-చివరి ర్యాంకు) వెబ్ ఆప్షన్ల ప్రక్రియ జరుగుతుంది. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు హెల్ప్‌లైన్ కేంద్రాలు అందుబాటులో ఉంటాయి. ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన రసీదు, పాలిసెట్ హాల్ టికెట్, ర్యాంకు కార్డు, 4 నుంచి పదో తరగతి వరకు స్టడీపత్రాలు, కుల (ఓసీ అభ్యర్థులైతే ఈడబ్ల్యూఎస్), ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్ కార్డుతో పాటు రెండు సెట్ల జిరాక్స్ కాపీలు తీసుకెళ్లాల్సి ఉంటుంది. పాలిటెక్నిక్ కౌన్సెలింగ్‌లో పాల్గొనే ఓసీ, బీసీ విద్యార్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.250 చొప్పున ఆన్‌లైన్ విధానంలో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలి.

## న్యూస్‌రీల్

### అరుదైన చేప.. చెడు చేస్తుందప్పా



**గుత్తి రూరల్:** మండలంలోని బ్రాహ్మణపల్లి చెరువులో అరుదైన దెయ్యం చేప లభ్యమైంది. సాధారణంగా సముద్ర తీర ప్రాంతాలైన కోనసీమ, ఉత్తరాంధ్ర జిల్లాల్లో కనిపించే ఈ చేప శనివారం స్థానిక మత్స్యకారుల వలకు చిక్కింది. అయితే దెయ్యం చేపలు తింటే అనారోగ్యం పాలవుతారని, ఈ చేపలు వృద్ధి చెందితే విలువైన చేపల అభివృద్ధికి ఆటంకం కలుగుతుందని తెలియడంతో మత్స్యకారులు దాన్ని చెరువు సమీపంలో పూడ్చిపెట్టారు.

### గ్యాస్ గీజర్ పేలి వృద్ధురాలి మృతి



మృతి చెందిన నారాయణమ్మ

**ఉరవకొండ:** గ్యాస్ గీజర్ పేలి వృద్ధురాలు మృతి చెందిన ఘటన ఉరవకొండలో జరిగింది. ఎస్‌ఐ జనార్దన్‌నాయుడు తెలిపిన వివరాలు.. ఉరవకొండ సాయిబాబా ఆలయం సమీపంలో నివాసముంటున్న దేవినేని నారాయణమ్మ (85) శనివారం ఇంట్లో స్నానానికి వెళ్లి గీజర్ ఆన్ చేసింది. ఈ క్రమంలోనే గ్యాస్ లీకై గీజర్ పేలి మంటలు చెలరేగాయి. దీంతో నారాయణమ్మ తీవ్రంగా గాయపడింది. గమనించిన కుటుంబ సభ్యులు హుటాహుటిన అనంతపురం తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం డాక్టర్ల సూచనల మేరకు బెంగళూరుకు తీసుకెళ్తుండగా మార్గమధ్యంలోనారాయణమ్మ కన్నుమూసింది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉరవకొండకు తరలించారు. ఈ మేరకు ఎస్‌ఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

### ఐసీడీఎస్‌లో 20 మంది తొలగింపునకు చర్యలు

**అనంతపురం అర్బన్:** ఐసీడీఎస్‌లో 20 మంది ఉద్యోగులు, సిబ్బంది తొలగింపునకు చర్యలు చేపట్టారు. ఇందుకు జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తెలిపింది. ఐసీడీఎస్ అంశాలపై కలెక్టర్ వినోద్‌కుమార్ శనివారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో పీడీ నాగమణితో కలిసి అధికారులతో సమీక్షించారు. వివిధ కారణాలతో విధులకు సక్రమంగా హాజరు కాని అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్ల తొలగింపుపై చర్చించారు. 20 మంది తొలగింపునకు ఐసీడీఎస్ జిల్లా స్థాయి ఎంపిక కమిటీ ఆమోదం తెలిపింది.

**యోగాపై అవగాహన కల్పించండి**

చిన్నారులు, గర్భిణులు, బాలింతలు, తల్లులు, బాలికలు, కిశోర బాలికలకు అవగాహన కల్పించి నిత్యం యోగా చేసేలా చూడాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సూచించారు. ఐసీడీఎస్ ఆధ్వర్యంలో రూపొందించిన యోగా పోస్టర్లను కలెక్టర్ ఆవిష్కరించారు. సమావేశంలో సీడీపీఓలు శ్రీదేవి, ఉమాశంకరమ్మ, సాజిదాబేగం, నాగమణి, పద్మావతి, లలితమ్మ, తదితరులు పాల్గొన్నారు.

# మీరు కూడా రప్పా..రప్పా అంటే ఎలా?

- పరిటాల సునీత వ్యాఖ్యలపై వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత ఆగ్రహం
- జయరామ్‌కు ప్రజలే తోక కట్ చేసి సున్నం పెడతారని హెచ్చరిక



మాట్లాడుతున్న అనంత వెంకటరామిరెడ్డి

**అనంతపురం కార్పొరేషన్:** 'సీఎం చంద్రబాబుకు వైఎస్ జగన్ భయం పట్టుకుంది. అందుకే రాష్ట్రంలో రెడ్ బుక్ పేరుతో దుష్ట సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రికి ఏమాత్రం తీసిపోకుండా కొందరు ఎమ్మెల్యేలు రాష్ట్రంలో హింసాత్మక వాతావరణం సృష్టించేందుకు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎమ్మెల్యే పరిటాల సునీత కూడా రప్పా.. రప్పా అంటే ఎలా.. వైఎస్సార్ సీపీ శ్రేణులను బెదిరించేలా వ్యాఖ్యలు చేసిన జయరామ్‌కు ప్రజలే తోక కట్ చేసి సున్నం పెడతారు' అని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి అన్నారు. శనివారం నగరంలోని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కూటమి ప్రభుత్వ ప్రజాప్రతినిధులపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తల నరకాలంటూ టీడీపీ నేత గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడడం దారుణమన్నారు. సినిమా డైలాగ్‌ను ఎవరో ప్లకార్డుపై ప్రదర్శిస్తే దానికి విపరీత అర్థాలు తీసుకువస్తున్నారన్నారు. రెడ్ బుక్ పేరుతో వైఎస్సార్ సీపీ నాయకులను జైల్లో ఉంచి, ఆరోగ్యం క్షీణిస్తున్నా పట్టించుకునే పరిస్థితి లేదని, సుప్రీంకోర్టు, హైకోర్టు అక్షింతలు వేసినా ప్రభుత్వంలో మార్పు రావడం లేదన్నారు.

**జయరామ్ ఎక్కడికి కాకుండా పోతావ్..**

ఏడాది పాలనలో ప్రజలకు ఏమీ చేయకపోవడంతో 'కూటమి'పై ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతోందని అనంత పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ నుంచి ఎవరూ పోటీ చేయకూడదని, సరెండర్ కావాలని, లేకపోతే తోలుతీస్తాం, తాట తీస్తామని గుంతకల్లు ఎమ్మెల్యే జయరామ్ అంటున్నారని, ఇవన్నీ చూస్తూ ఇక్కడి ప్రజలు ఊరుకోరన్నారు. ఇటీవల విలేకరులను రైలు పట్టాలపై పడుకోబెడతానని బెదిరించారని, జయరామ్ నోటికి అదుపు లేదా అని ధ్వజమెత్తారు. గుంతకల్లు, గుత్తి, పామిడి మండలాల్లో షాడో ఎమ్మెల్యేలను పెట్టి ఇసుక దోపిడీ చేస్తున్నారన్నారు. గుంతకల్లులో పేకాట, మట్కా విచ్చలవిడిగా సాగుతోందన్నారు. జిల్లా ప్రజలను తక్కువగా అంచనా వేస్తే ఎక్కడికి కాకుండా పోతారని హెచ్చరించారు. గుమ్మనూరు వ్యాఖ్యలను పోలీసులు సుమోటోగా తీసుకుని కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

**పరిటాల చరిత్ర తెలియదా:**

పరిటాల రాజకీయ ఎంట్రీ ఎలా జరిగిందో అందరికీ తెల్సిందేనని అనంత తెలిపారు. ఇవాళ ఆ కుటుంబం కూడా రప్పా..రప్పా అంటూ మాట్లాడి మరీ ఘోరంగా తయారవుతోందన్నారు. పోలీసు, రెవెన్యూ వ్యవస్థలను అడ్డం పెట్టుకుని దౌర్జన్యాలకు పాల్పడుతున్నారన్నారు. ఎలాగైనా స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలవాలని కూటమి ప్రజాప్రతినిధులు చూస్తున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే ఎన్నికలకు వైఎస్సార్ సీపీ సిద్ధంగా ఉందన్నారు. టీడీపీకి భవిష్యత్తు లేకుండా ప్రజలు సున్నం పెట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కూటమి ప్రభుత్వానికి అనుకూలంగా ఉండే ఓ సంస్థ ఇటీవల సర్వే నిర్వహిస్తే అందులో 53 మంది ఎమ్మెల్యేలు రెడ్‌జోన్‌లో ఉన్నారని, అందులో ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ ఒకరని అనంత పేర్కొన్నారు. సమావేశంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్ రెడ్డి, అధికార ప్రతినిధి మారుతీ నాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగరాధ్యక్షుడు శ్రీనివాస్‌దత్తా, ఉపాధ్యక్షుడు ఉదయ్, ప్రధాన కార్యదర్శి హిదాయతుల్లా పాల్గొన్నారు.

## టీబీ డ్యాంకు కొనసాగుతున్న వరద



కళకళలాడుతున్న తుంగభద్ర జలాశయం

**బొమ్మనహాళ్:** కర్ణాటకలోని తుంగభద్ర జలాశయానికి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. శనివారం సాయంత్రానికి 38 వేల క్యూసెక్కులకు చేరింది. జలాశయం ఎగువ ప్రాంతాల్లో ఆశాజనకంగా వర్షాలు కురుస్తుండడంతో ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటి నిల్వ 1,612.09 అడుగులకు చేరుకుంది. ఇన్‌ఫ్లో 38,007 క్యూసెక్కులు కాగా అవుట్‌ఫ్లో 193గా ఉంది. గతేడాది ఇదే సమయానికి 1,582.32 అడుగుల వద్ద 5.700 టీఎంసీల నీరు నిల్వతో 831 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో, 1,802 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో ఉండిందని బోర్డు అధికారులు తెలిపారు.

**నీటి విడుదలపై 27న సమావేశం..**

తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీ, ఎల్లెల్సీ, ఇతర కాలువలకు నీటి విడుదలపై ఈనెల 27న సమావేశం నిర్వహించనున్నట్లు తుంగభద్ర బోర్డు అధికారులు తెలిపారు. బెంగళూరు విధాన సౌధలో జరిగే సమావేశంలో ఇరు రాష్ట్రాల ఇరిగేషన్ ఉన్నతాధికారులు, నీటి సలహా మండలి సభ్యులు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. కాగా, గతేడాది వరద నీటి ప్రవాహానికి టీబీ డ్యాం 19వ క్రస్ట్ గేటు కొట్టుకుపోవడంతో స్టాప్‌లాక్ గేటు ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో ఈ ఏడాది ముందుగానే నీటి విడుదలపై చర్చించనున్నట్లు సమాచారం.



# యోగాతో ఒత్తిడి దూరం

- కలెక్టర్ వినోద్‌కుమార్



యోగా సాధన చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎస్పీ జగదీష్

**అనంతపురం కల్చరల్:** యోగాతో ఒత్తిడి దూరమవుతుందని కలెక్టర్ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. స్థానిక పీటీసీ మైదానంలో శనివారం ఆయుష్, యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్, వివిధ యోగా కేంద్రాల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ వినోద్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎస్పీ పి.జగదీష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా భాగం కావాలన్నారు. పాఠశాల స్థాయి నుంచే యోగాను అలవర్చుకోవాలన్నారు. బ్రహ్మకుమారీల ఇన్‌చార్జ్ సిస్టర్ శారద, వివేకానంద యోగా కేంద్ర అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి, యోగా శిక్షకురాలు కృష్ణవేణి మాట్లాడుతూ యోగాతో ఆరోగ్యకర సమాజాన్ని నిర్మించగలమన్నారు. అనంతరం క్లాత్ బ్యాగులను పంపిణీ చేశారు. రాష్ట్రస్థాయి 'యోగాంధ్ర' పోటీల్లో పాల్గొన్న వారికి ప్రశంసాపత్రాలనందించి సత్కరించారు. కార్యక్రమంలో జేసీ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, డీఎంహెచ్‌ఓ డాక్టర్ దేవి, నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి, ఆయుష్ అధికారులు డాక్టర్ రామకుమార్, లాల్యా నాయక్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ మమత, తదితరులు పాల్గొన్నారు.



అనంతపురం పీటీసీలో నిర్వహించిన కార్యక్రమంలో యోగాసనాలు వేస్తున్న నగరవాసులు

# జయరామ్.. నోరు అదుపులో పెట్టుకో

- వెన్నుపోటులో చంద్రబాబును మించిపోయావ్
- మాజీ ఎమ్మెల్యే వైవీఆర్ ధ్వజం
- ధైర్యముంటే రాజీనామా చేసి ఎన్నికల్లో పోటీ చేయాలని సవాల్



వెంకటరామిరెడ్డి, గుంతకల్లు మాజీ ఎమ్మెల్యే

**గుంతకల్లుటౌన్:** ఎమ్మెల్యే గుమ్మనూరు జయరామ్ నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు నామినేషన్ వేయకుండా చేస్తానంటూ జయరామ్ చేసిన వివాదాస్పద వ్యాఖ్యలపై వైవీఆర్ ఘాటుగా స్పందించారు. ఎమ్మెల్యేగా కొనసాగుతూ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించేలా వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రకటన విడుదల చేశారు.ప్రజాస్వామ్య దేశంలో డాక్టర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగమే అమలు కావాలన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం ఇక్కడ చెల్లుబాటు కాదన్నారు. వ్యతిరేక వార్తలు రాసే పాత్రికేయులను పట్టాలపై పడుకోబెడతానని బెదిరించినట్లు, వైఎస్సార్ సీపీ కార్యకర్తలను భయపెట్టాలని చూస్తే సహించబోమన్నారు. తాటాకు చప్పుళ్లకు భయపడేవారెవ్వరూ లేరన్నారు. జయరామ్ దౌర్జన్యాల నుంచి తమ పార్టీ కార్యకర్తలు, గుంతకల్లు నియోజ కవర్గ ప్రజలను కాపాడుకునేందుకు పోరాటాలకు సిద్ధమని స్పష్టం చేశారు. జయరామ్‌కు ఎలా సమాధానం చెప్పాలో బాగా తెలుసునన్నారు. రాజకీయంగా ప్రాణం పోసి మంత్రి పదవిచ్చిన మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డినే వెన్నుపోటు పొడిచారని, వెన్నుపోటులో చంద్రబాబును మించిపోయారని ఎద్దేవా చేశారు. పేకాట, లిక్కర్, ఇసుక స్కామ్‌లకు పెద్ద ఎత్తున పాల్పడుతున్నారని టీడీపీ అనుకూల పత్రికలు, ఎల్లో మీడియాలోనే జయరామ్‌పై కథనాలు ప్రసారమవుతున్నాయన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. టీడీపీ అధిష్టానం జయరామ్‌కెప్పుడో రెడ్‌మార్క్ వేసిందన్నారు. ఇతడి ప్రవర్తన, దౌర్జన్యాలతో టీడీపీ శ్రేణులంతా విసిగిపోయారన్నారు. జయరామ్‌కు ధైర్యముంటే ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి మళ్లీ పోటీ చేయాలని, తన నామినేషన్‌ను అడ్డుకోగలిగితే రాజకీయాల నుంచి తాను శాశ్వతంగా తప్పుకుంటానని వైవీఆర్ సవాల్ విసిరారు. మోసపూరిత హామీలు, ఈవీఎంల పుణ్యంతో గెలిచిన జయరామ్ ఇకనైనా దౌర్జన్యాలు చేయడం మానుకుని ప్రజా సంక్షేమం, నియోజకవర్గ అభివృద్ధికి పాటుపడాలని ఆయన సూచించారు.

## క్లుప్తంగా

### విద్యుదాఘాతంతో టిప్పర్ డ్రైవర్ మృతి

**యాడికి:** టిప్పర్‌కు విద్యుత్ తీగలు తగలడంతో డ్రైవర్ షాక్‌కు గురై మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. రాయలచెరువు గ్రామానికి చెందిన తలారి లోకేష్ (30) ఇదే గ్రామానికి చెందిన మదమంచి శివనాయుడుకు చెందిన టిప్పర్‌కు డ్రైవర్‌గా వెళ్తున్నాడు. యజమాని సూచన మేరకు శనివారం సాయంత్రం రాయలచెరువు సమీపంలో ఉన్న చెరువు మట్టిని టిప్పర్‌లో లోడు వేయించుకుని సమీపంలో గల యజమాని తోటలో అన్‌లోడు చేశాడు. అనంతరం టిప్పర్ ట్రాలీని ఎత్తుగా పెట్టుకున్న లోకేష్ తోటలో నుంచి టిప్పర్‌ను రోడ్డు మీదకు తెస్తుండగా విద్యుత్ వైరు తీగలు ట్రాలీని తాకాయి. దీంతో ఒక్కసారిగా టిప్పర్‌ను ఆపి కిందకు దిగిన లోకేష్ వెంటనే కుప్పకూలాడు. సమాచారం అందుకున్న టిప్పర్ యజమాని శివనాయుడుతో పాటు సమీప రైతులు అందరూ పరుగెత్తుకుంటూ వచ్చి చూడగా అప్పటికే లోకేష్ మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే భార్య సుంకులమ్మ తన కూతురితో వచ్చి లోకేష్ మృతదేహంపై పడి రోదించారు.

### మహిళా సర్పంచులకు రేపటి నుంచి శిక్షణ

**అనంతపురం సిటీ:** రాష్ట్ర గ్రామ స్వరాజ్య అభియాన్ (ఆర్‌జీఎస్‌ఏ) కింద ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మహిళా సర్పంచులకు సోమవారం నుంచి మూడు రోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు సీఈఓ శివశంకర్ శనివారం తెలిపారు. 'స్థానిక పాలనలో మహిళా సాధికారత' అనే అంశంపై డివిజనల్ స్థాయిలో శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు వివరించారు. జిల్లాలో మూడు డివిజన్లలో శిక్షణ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. అనంతపురం డివిజన్‌కు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయ క్యాంపస్‌లోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్‌సీ)లో, గుంతకల్లు డివిజన్ వారికి గుత్తి మండల పరిషత్ కార్యాలయంలో, కళ్యాణదుర్గం డివిజన్ వారికి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ తరగతులకు ఏర్పాట్లు చేసినట్లు సీఈఓ వెల్లడించారు. శిక్షణ తరగతుల నిర్వహణ పర్యవేక్షణకు రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శిక్షణ సంస్థకు చెందిన అధికారులు పరిశీలకులుగా వస్తారని పేర్కొన్నారు.

# తక్కువ జీతం... ఎక్కువ దూరం

- ఇదీ ఎంటీఎస్ టీచర్ల బదిలీల దుస్థితి
- గత ప్రభుత్వంలో దాదాపు అందరికీ అనుకూలమైన స్కూళ్లలో కొలువులు
- ఈసారి మెజార్టీ టీచర్లకు జిల్లా సరిహద్దు మండలాలు తప్పేలా లేవు
- ఖాళీల మేరకే భర్తీ చేస్తున్నామంటున్న విద్యాశాఖ అధికారులు



**అనంతపురం ఎడ్యుకేషన్:** మినిమం టైమ్ స్కేల్ (ఎంటీఎస్) టీచర్లు తక్కువ వేతనంతో పని చేస్తున్నారు. వీరికి నెలకు దాదాపు రూ.32 వేల జీతం వస్తుంది. ఇది రెగ్యులర్ టీచర్లతో పోల్చితే సగం కూడా ఉండదు. సొంత మండలాలు, సమీప మండలాల్లోని స్కూళ్లలో పని చేస్తే ఉపయోగకరంగా ఉంటుంది. అయితే ఎక్కడో వందలాది కిలోమీటర్ల దూరంలో ఉన్న స్కూళ్లకు వెళ్లాలంటే వారి పరిస్థితి ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈసారి ఉమ్మడి జిల్లాలోని మెజార్టీ ఎంటీఎస్ టీచర్లకు జిల్లా సరిహద్దు మండలాలు తప్పేలా లేవు. నిబంధనల మేరకు మిగులు ఖాళీలను చూపిస్తున్నామని అధికారులు చెబుతున్నా.. ఇందులో 70 శాతానికి పైగా ఉన్నవన్నీ సరిహద్దు మండలాల్లోనే. ఇటీవల జరిగిన బదిలీల తర్వాత మొత్తం జిల్లాలో 593 మిగులు ఖాళీలుగా తేల్చారు. ఇందులో జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో 558, ప్రభుత్వ పాఠశాలల్లో 16, క్లస్టర్ స్కూళ్లల్లో 119 ఖాళీలున్నాయి. గత ప్రభుత్వంలో ఎంటీఎస్ టీచర్లకు సౌలభ్యమైన చోట్లే పని చేసే అవకాశాలు కల్పించారు. ఈసారి కొత్త చట్టం అనుసరించి బదిలీలు చేశామని, ఈక్రమంలో మిగులుగా ఉన్న స్కూళ్లకు ఎంటీఎస్‌లను సర్దుబాటు చేస్తామని అధికారులు చెబుతున్నారు. ఇప్పటిదాకా ఓడీచెరువు మండలంలో 19 మంది ఎంటీఎస్‌లు పని చేస్తుండగా ఇప్పుడు రెండు ఖాళీలు చూపించారు. అలాగే అమడగూరులో 11 మందికి గాను రెండు, కదిరి, ముదిగుబ్బ, తనకల్లు మండలాల్లో 9 మంది చొప్పున పని చేస్తుంటే రెండు చొప్పున, తలుపులలో 8 మంది పని చేస్తుండగా రెండు ఖాళీలు చూపించారు. అనంతపురం, ధర్మవరం, తాడిపత్రి, గుంతకల్లు, హిందూపురం ప్రాంతాల్లోని మండలాల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ప్రతి చోటా పది మందికి పైగా పని చేస్తుండగా రెండు చొప్పున ఖాళీలు చూపించారు.

**ఎక్కువ సంఖ్యలో చూపించిన మండలాలు ఇలా...**

గుడిబండ 75, గుమ్మఘట్ట 71, డి.హీరేహాళ్ 60, అమరాపురం 57, అగళి 36, బొమ్మనహాళ్ 42, బ్రహ్మసముద్రం 30, కంబదూరు 23, కణేకల్లు 22, రాయదుర్గం 26, శెట్టూరులో 23 ఖాళీలున్నాయి. వీటి తర్వాత వజ్రకరూరు, మడకశిర మండలాల్లో అత్యధికంగా ఆరు ఖాళీలుండగా, తక్కిన అన్ని మండలాల్లోనూ 1, 2, 3 ఖాళీలున్నాయి.

**బాయ్‌కాట్ యోచనలో ఎంటీఎస్ టీచర్లు**

ఇప్పటికే ఎక్కడెక్కడ ఖాళీలున్నాయనే దానిపై స్పష్టత వచ్చిన ఎంటీఎస్ టీచర్లు బదిలీ కౌన్సెలింగ్‌ను బాయ్‌కాట్ చేయాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఈ క్రమంలో వారి వాట్సాప్ గ్రూపుల్లో విపరీతంగా మెసేజ్‌లు వైరల్ అవుతున్నాయి. తక్కువ జీతంతో ఎక్కువమంది సొంత మండలాలు, పక్క మండలాల్లో పని చేస్తున్నామని ఇప్పుడున్న ఖాళీలన్నీ జిల్లా సరిహద్దు మండలాల్లో చూపిస్తే.. కుటుంబాలు వదిలి ఎలా వెళ్లాలని ప్రశ్నిస్తున్నారు. తనకల్లు, తలుపుల, నల్లచెరువు తదితర మండలాల్లో పని చేస్తున్న టీచర్లు దాదాపు 200 కిలోమీటర్ల దూరం వెళ్లాలంటే ఎక్కడ సాధ్యమని వాపోతున్నారు. ప్రభుత్వం తమపట్ల దయతలచి న్యాయం చేయాలని లేనిపక్షంలో కౌన్సెలింగ్‌ను బహిష్కరిస్తామని అంటున్నారు.

**నేడు జిల్లా సైన్స్ కేంద్రంలో బదిలీల కౌన్సెలింగ్**

డీఎస్సీ–1998, 2008 ఎంటీఎస్ టీచర్ల బదిలీలకు ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా సైన్స్ కేంద్రంలో కౌన్సెలింగ్ ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు తెలిపారు. ఉపాధ్యాయుల జాబితాను డీఈఓ బ్లాగ్‌స్పాట్‌లో ఉంచినట్లు వెల్లడించారు.

### బాలింతలతో 'వసూళ్లు'



బాలింత కౌసర్, చిత్రంలో తమ్ముడు సాదిక్

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వాస్పత్రిలో ప్రసవమైన వారికి ఆర్థికసాయం ఇప్పిస్తామని అగంతకులు బాలింతల నుంచి వసూళ్లకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటన ఒకటి శనివారం వెలుగు చూసింది. అనంతపురం నగర శివారులోని ఆలమూరు రోడ్డులో ఉంటున్న కౌసర్ ఇటీవల ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చేరింది. ఈ నెల 17న ఆడబిడ్డకు జన్మనిచ్చింది. మరుసటి రోజు వీరికి ఓ వ్యక్తి ఫోన్ చేశాడు. ఆమె ఆధార్, కుటుంబ వివరాలు తెలియజేసి.. రూ.1000 ఇస్తే, ఎన్టీఆర్ వైద్య సేవ కింద డబ్బులు మంజూరు చేయిస్తామని చెప్పాడు. దీంతో కౌసర్ నిజమని నమ్మి గూగుల్ పే నుంచి రూ.వెయ్యి పంపారు. అనంతరం డబ్బు వసూలు గురించి డేటా ఎంట్రీ ఆపరేటర్ల దృష్టికి వెళ్లడంతో వారు సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారాంకు ఫిర్యాదు చేశారు. ఇది ఎవరో గుర్తు తెలియని వ్యక్తి చేసిన పని అని ఆస్పత్రి వర్గాలు నిర్ధారణకు వచ్చాయి. అయితే సదరు అపరిచిత వ్యక్తికి తిరిగి ఫోన్ చేస్తే రిసీవ్ చేసుకోవడం లేదని తెలిసింది. ప్రభుత్వం నుంచి అందే ఆర్థికసాయం తదితర సేవల గురించి అవగాహన కల్పించడంలో వైద్యులు, అధికారులు నిర్లక్ష్యం వహించడం వల్లే ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

# వివాహిత అనుమానాస్పద మృతి

- పోలీస్ స్టేషన్ వద్ద బంధువుల ఆందోళన





మృతురాలు రాజేశ్వరి, ధర్నా చేస్తున్న రాజేశ్వరి బంధువులు

**పామిడి:** వివాహిత అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన పామిడిలో కలకలం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్థానిక ఫారెస్ట్ బంగ్లా వద్ద నివాసం ఉంటున్న ఈశ్వర్ రెడ్డి, రాజేశ్వరి (28) దంపతులు. వీరికి కుమార్తె భవ్యశ్రీ, కుమారుడు మూర్తీశ్వర్ రెడ్డి సంతానం. ఈశ్వర్‌రెడ్డి కువైట్‌లో పని చేస్తూ వీరిని పోషిస్తున్నాడు. రాజేశ్వరి స్థానిక నాగిరెడ్డి కాలనీకి చెందిన ఆటో డ్రైవర్ ఉప్పర భాస్కర్‌తో వివాహేతర సంబంధం ఉంది. ఈ విషయం బయట పడిన తర్వాత ఇరువర్గాల మధ్య పంచాయితీలు జరిగాయి. పోలీస్ స్టేషన్ వరకు వెళ్లినా వారిలో మార్పు రాలేదు. యథావిధిగా వివాహేతర సంబంధం కొనసాగిస్తూనే వస్తున్నారు. ఈ క్రమంలో ఇటీవలే కువైట్ నుంచి వచ్చిన భర్త శుక్రవారం రాత్రి తిరిగి విధి నిర్వహణ నిమిత్తం వెళ్లిపోయాడు. సమాచారం తెలుసుకున్న భాస్కర్ శనివారం రాజేశ్వరిని ఆటోలో ఎక్కించుకుని వంకరాజుకాలువ గ్రామానికి వెళ్లే దారిలోని మోరీ వద్దకు తీసుకెళ్లాడు. అక్కడ వారి మధ్య ఏమి జరిగిందో తెలియదు కానీ... రాజేశ్వరి రక్తగాయాలతో పడి ఉంది. దీన్ని అటుగా వచ్చిన వారు గమనించి భాస్కర్‌ను ప్రశ్నిస్తే.. రాజేశ్వరి తన భార్య అని, ఫిట్స్ వచ్చి పడిపోయిందని వారిని నమ్మించాడు. అనంతరం ఆటోలో ఆమెను పామిడి కమ్యూనిటీ ఆస్పత్రికి తెచ్చాడు. అక్కడి నుంచి నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. విషయం తెలుసుకున్న గుత్తి సీఐ వెంకటేశ్వర్లు హుటాహుటినా పామిడి పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్నారు. రాజేశ్వరి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు నమోదు చేశారు.

**ఆటో డ్రైవరే హత్య చేశాడు**

తమ కుమార్తె రాజేశ్వరిని ఆటో డ్రైవర్ ఉప్పర భాస్కర్ హత్య చేశాడని తల్లిదండ్రులు రామకృష్ణారెడ్డి, మాధవి ఆరోపించారు. బంధువులతో కలిసివారు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేశారు. హంతకుడుని కఠినంగా శిక్షించి, న్యాయం చేయాలని నినాదాలు చేశారు.

# ప్రభుత్వానికి కనువిప్పు కల్గిద్దాం



పోస్టర్లు విడుదల చేస్తున్న అనంత వెంకటరామిరెడ్డి, తదితరులు

- యువత పోరును జయప్రదం చేద్దాం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత

**అనంతపురం కార్పొరేషన్:** యువతను నిర్లక్ష్యం చేస్తున్న ప్రభుత్వానికి కనువిప్పు కల్గించేందుకు వైఎస్సార్‌సీపీ ఈ నెల 23 పిలుపునిచ్చిన యువత పోరు ధర్నాను విజయవంతం చేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పిలుపునిచ్చారు. శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో యువజన విభాగం ఆధ్వర్యంలో యువత పోరు పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అనంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబునాయుడు అన్ని వర్గాలనూ దగా చేస్తున్నారన్నారు. మోసపోతున్న యువతకు అండగా నిలవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ఏడాది గడిచినా ఇంత వరకు అమలు చేయకపోవడం దారుణమన్నారు. ఏడాదిగా ఉద్యోగాలు కల్పించకుండా.. ఉన్న ఉద్యోగులను తొలగిస్తూ, యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల పక్షాన నిలబడుతూ పోరాటాలు చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణుల పట్ల ప్రభుత్వం అక్రమ కేసులను బనాయిస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. ప్రతి ఒక్కరూ ఈ నెల 23న కలెక్టరేట్ ముందు జరిగే ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ మాట్లాడుతూ ఎన్నికలకు ముందు 20 లక్షల ఉద్యోగాలు, లేని పక్షంలో నిరుద్యోగ భృతి, ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ఇస్తామని చంద్రబాబు చేసిన వాగ్దానాలను మర్చిపోయారన్నారు. యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉమ్మడి మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం మెడలు వంచైనా యువతకు న్యాయం జరిగేలా చూస్తామన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో సచివాలయం, వైద్య రంగంలో లక్షలాది పోస్టులను ప్రభుత్వం భర్తీ చేసిందన్నారు. ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం మాటలతోనే కాలయాపన చేస్తోందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో యువజన విభాగం రాష్ట్ర అధికార ప్రతినిధి మారుతీనాయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు దాదాఖలందర్, నగరాధ్యక్షులు దత్తా, ప్రధాన కార్యదర్శి హిదయతుల్లా, ఉపాధ్యక్షుడు ఉదయ్, నాయకులు మైను, సోహైల్, సాయికృష్ణ, బాలిరెడ్డికుమార్, జగదీష్, వేణు, బాబా పాల్గొన్నారు.

### నిద్రలోనే పరలోకాలకు...



మృతుడు సుధీర్‌రెడ్డి

**గార్లదిన్నె:** కల్లూరులో ఓ యువకుడు అనుమానాస్పదస్థితిలో మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ క్రిష్ణమూర్తి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కల్లూరుకు చెందిన నాగభూషణరెడ్డి, సావిత్రి దంపతుల కుమారుడు సుధీర్ రెడ్డి (29) పామిడిలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు. శనివారం ఉదయం ఇంట్లో మంచంపై నిద్రిస్తూనే ప్రాణం విడిచాడు. చెట్టంత కొడుకు తిరిగిరాని లోకాలకు వెళ్లడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేశారు.

### మహిళ ఆత్మహత్య

**శెట్టూరు:** అడవిగొల్లపల్లికి చెందిన రామాంజినమ్మ (45) జీవితంపై విరక్తితో ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మూడేళ్ల వ్యవధిలో రామాంజినమ్మ భర్త, కుమారుడు మరణించారు. అప్పటి నుంచి ఒంటరిగా జీవనం సాగిస్తున్న రామాంజినమ్మకు అనారోగ్య సమస్యలు చుట్టుముట్టాయి. జీవితంపై విరక్తి చెందిన ఆమె శనివారం తెల్లవారుజామున ఇంట్లోనే ఉరివేసుకుంది. ఉదయం ఎంతసేపటికీ రామంజినమ్మ బయటకు రాకపోవడంతో చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు తెరిచి చూడగా.. విగతజీవిగా కనిపించింది. వెంటనే కుమార్తె ఉమాదేవికి, పోలీసులకు గ్రామస్తులు సమాచారం చేరవేశారు. పోలీసులు కేసు నమోదు చేసి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు.

### బెదిరింపులు, దౌర్జన్యాలకు తావులేదు



ఎమ్మెల్సీ శివరామిరెడ్డి

**ఉరవకొండ:** వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను బెదిరిస్తూ గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం చేసిన వాఖ్యలను శాసనమండలి ప్రివిలేజ్ కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి ఖండించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎవ్వరూ పోటీ చేయరాదని, ఎన్నికలకు ముందే అందరూ టీడీపీలో చేరాలని, లేకపోతే తోలు తీస్తాం, తోక కట్ చేస్తాంటూ బహిరంగ వ్యాఖ్యలు చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్యంలో బెదిరింపులు, దౌర్జన్యాలకు తావు లేదన్నారు. మరో సారి ఇలాంటి వాఖ్యలు చేస్తే సహించేది లేదన్నారు. కర్నూలు జిల్లాలో రెండు సార్లు ఎమ్మెల్యేగా చేసి, చివరకు నీ తోక కట్ చేస్తే అనంతపురం జిల్లాకు వచ్చి చంద్రబాబుతో పైరవీలు చేసి గుంతకల్లు సీటు తెచ్చుకున్నావన్నారు. ప్రజాసమస్యలు పరిష్కరించకుండా సోదరులతో కలిసి అక్రమాలు, దౌర్జన్యాలు చేస్తూ హింసాత్మక రాజకీయాలు చేస్తున్నావని, త్వరలోనే గుంతకల్లు ప్రజలు కూడా నీ తోక కట్ చేయనున్నారన్నారు.

### ఉడత ఊపులకు భయపడం



రమేష్‌గౌడ్

**అనంతపురం కార్పొరేషన్:** గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం ఉడత ఊపులకు ఎవరూ భయపడరని వైఎస్సార్‌సీపీ జిల్లా టాస్క్‌ఫోర్స్ సభ్యులు రమేష్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు టీడీపీలోకి రాకపోతే వారి తాట తీస్తామంటూ గుమ్మనూరు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గతంలో ఆలూరు ప్రజలు గుమ్మనూరును కొడితే గుంతకల్లుకు వచ్చి పడ్డారని ఎద్దేవా చేశారు. ఇప్పటికే కూటమి ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత మొదలైందని, స్థానిక సంస్థలకు ముందే భయాందోళన వాతావరణం సృష్టించేందుకు గుమ్మనూరు జయరాం చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని మండిపడ్డారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన పోలీసులు ఇటువంటి మాటలపై స్పందించి ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయాలన్నారు. మరోసారి దిగుజారుడు మాటలు మాట్లాడితే ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామన్నారు.

# ఎస్‌ఆర్‌ఐటీలో ఉద్యోగాల పంట



ఎస్‌ఆర్‌ఐటీ కరస్పాండెంట్ ఆలూరు సాంబ శివారెడ్డితో ఉద్యోగాలు దక్కించుకున్న విద్యార్థులు

- 400 మంది విద్యార్థులకు క్యాంపస్ కొలువులు
- టీసీఎస్‌కు 157, కాగ్నిజెంట్‌కు 98 మంది ఎంపిక

**అనంతపురం:** బుక్కరాయసముద్రం మండలం రోటరీపురం వద్దనున్న శ్రీనివాస రామానుజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎస్‌ఆర్‌ఐటీ) కళాశాలలో 400 మంది విద్యార్థులు క్యాంపస్ ఇంటర్వ్యూల్లో కొలువులు సాధించారు. ప్రముఖ బహుళజాతి సంస్థలు అయిన టీసీఎస్, కాగ్నిజెంట్, ఇన్ఫోసిస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ తదితర వాటిల్లో కొలువులు దక్కించుకున్నారు. ఏకంగా రూ.4 లక్షల నుంచి రూ.6.75 లక్షల వార్షిక వేతనం పొందనున్నారు. కాగ్నిజెంట్ కంపెనీలో 98 మంది, టీసీఎస్‌లో 157, ఇన్ఫోసిస్‌లో 21, హెచ్‌సీఎల్ టెక్‌లో 16, క్యాడ్‌ఎస్‌వైఎస్, లూమిన్, ప్లేటో, ఫోక్స్‌కాన్, ఐఆర్‌ఎంఏఐ కంపెనీల్లో 118 మందికి ఉద్యోగాలు వరించాయి. క్యాంపస్ కొలువులు అత్యధికంగా సాధించిన కళాశాలగా ఉమ్మడి అనంతపురం జిల్లాలోనే ఎస్‌ఆర్‌ఐటీ అగ్రస్థానంలో ఉండడం విశేషం. ఈ నెల 26న కంపెనీల్లో ఉద్యోగాలకు చేరనున్నారు. ఈ మేరకు ఆఫర్ లెటర్లు సైతం ఆయా కంపెనీలు ఇచ్చాయి. ఈ సందర్భంగా శనివారం ఆ విద్యార్థులను కళాశాల యాజమాన్యం, అధ్యాపకబృందం అభినందించింది. కార్యక్రమంలో ఇండస్ట్రీ రిలేషన్స్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డాక్టర్ ఎం.రంజిత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ జి.బాలకృష్ణ పాల్గొన్నారు

**కళాశాలకు, కంపెనీకి అనుసంధానం**

విద్యార్థుల శ్రమకు, అధ్యాపకుల మార్గదర్శనానికి నిదర్శనమే ఈ ఫలితాలు. కళాశాలకు, కంపెనీకి అనుసంధానంతోనే సంచలన ఫలితాలు సాధ్యమయ్యాయి. సాఫ్ట్‌వేర్ కొలువులు పొందాలంటే ఎస్‌ఆర్‌ఐటీకే సాధ్యమని నిరూపించాం. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా తర్ఫీదు ఇస్తున్నాం. మంచి కంపెనీల్లో కొలువులు దక్కిన విద్యార్థులందరికీ అభినందనలు.

– ఆలూరు సాంబశివారెడ్డి, కరస్పాండెంట్, ఎస్‌ఆర్‌ఐటీ

# 'సిద్ధార్థ'లో ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



యువ ఇంజినీర్‌కు గోల్డ్ మెడల్ అందజేస్తున్న వీసీ సుదర్శనరావు, అశోకరాజు

**నారాయణవనం:** పుత్తూరు సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. అనంతపురం జేఎన్‌టీయూ వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ సుదర్శనరావు, వోల్వా గ్రూప్ రిటైర్డ్ డైరెక్టర్ ఇందు శేఖర్ ముఖ్య అతిథులుగా పాల్గొని పాస్ అవుట్ ఇంజినీరింగ్ విద్యార్థులకు మెడల్స్, పట్టాలు అందజేశారు. అనంతరం ఆడిటోరియంలో జరిగిన కాన్వొకేషన్ డే సమావేశంలో కళాశాల చైర్మన్ డాక్టర్ అశోకరాజు మాట్లాడుతూ గ్రామీణ విద్యార్థులకు మెరుగైన సాంకేతిక విద్య అందించడానికి సిద్ధార్థ గ్రూప్ కళాశాలలు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రపంచస్థాయి ల్యాబ్, డిజిటల్ లైబ్రరీ, ఇంక్యుబేషన్ సెంటర్లను అభివృద్ధి చేశామన్నారు. విద్యా ప్రమాణాలు, నాణ్యతలో రాజీ పడకుండా విద్యనందిస్తున్నామని పేర్కొన్నారు. వైస్ చాన్స్‌లర్ సుదర్శనరావు మాట్లాడుతూ తోటి వారితో పోటీపడి సృజనాత్మక, ఇన్నొవేటివ్ విద్యపై శ్రద్ధ చూపాలన్నారు. యువ ఇంజినీర్లు నిరంతరం పరిశోధనలపై దృష్టి సారించాలన్నారు. సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 903 మంది, సిద్ధార్థ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ కళాశాలలో ఉత్తీర్ణత పొందిన 485 మందికి డిగ్రీ కాన్వొకేషన్లు అందజేశారు. 2024–25లో విద్యా సంవత్సరానికి సంబంధించి 17 మంది విద్యార్థులకు గోల్డ్ మెడళ్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో యూనివర్సిటీ నామినీస్ ప్రశాంతి, అరుణక్రాంతి, ప్రిన్సిపాల్ మధు, జనార్దనరాజు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినర్ విజయభాస్కర్, గోపి, హెచ్‌ఓడీలు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## క్లుప్తంగా

### రొట్టెల పండుగకు సర్వం సిద్ధం



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మతపెద్దలు

**అనంతపురం కల్చరల్:** కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా పేరు గాంచిన రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. వివిధ ప్రదేశాల నుంచి ఉత్సవానికి తరలి వచ్చే భక్తులకు అన్ని వసతులు కల్పిస్తున్నారు. నగర శివారులోని మహాదేవనగర్ ఖాదిరి చమన్ దర్గాను విద్యుద్దీప కాంతులతో శోభాయమానంగా అలంకరించారు. శనివారం జరిగిన సమావేశంలో రొట్టెల పండుగకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. దర్గా ప్రతినిధులు సజ్జద్ షేక్ సయ్యద్ నూర్ బాషా ఖాదిరి మాట్లాడుతూ.. ఆదివారం రాత్రి రొట్టెల పండుగ జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా పీర్ మహమ్మద్ వలీషా ఖాద్రి గంధం మహోత్సవం, ఖవాలీ, అన్నదాన కార్యక్రమాలు పెద్ద ఎత్తున జరుగుతాయని తెలిపారు. భక్తులు పెద్ద ఎత్తున తరలిచ్చి ప్రసాదం అందుకోవాలని కోరారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఫయాజ్ ఖాద్రీ, ఖాజా, మహబూబ్ బాషా, సిరాజ్, చిష్టి, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

### పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



ప్రతిజ్ఞ చేస్తున్న డీఆర్‌ఓ మలోల, అధికారులు, సిబ్బంది

**అనంతపురం అర్బన్:** పర్యావరణ పరిరక్షణ ద్వారానే భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణం అందించగలమని డీఆర్‌ఓ ఎ.మలోల అన్నారు. ఈ లక్ష్యం అందరి బాధ్యతన్నారు. శనివారం కలెక్టరేట్‌లో స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ, అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. డీఆర్‌ఓ మాట్లాడుతూ.. పచ్చదనం పెంపు ద్వారా పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ప్రతి నెల ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం దైనందిన జీవనంలో భాగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో పరిపాలనాధికారి అలెగ్జాండర్, విభాగాధిపతులు వసంతలత, వాణిశ్రీ, యుగేశ్వరి దేవి, రియాజుద్దీన్, డిప్యూటీ తహసీల్దార్లు శ్రీనివాస మూర్తి, లీలా కాంత్, హరి ప్రసాద్, జయశ్రీ, ఏఎస్ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

### మహిళా సాధికారతకు ప్రతిరూపం 'ఇంతియానం 2.0'



మాట్లాడుతున్న స్వర్ణ కిలారి

**అనంతపురం కల్చరల్:** మహిళా సాధికారతకు ప్రతిరూపంగా 'ఇంతియానం 2.0' కథల పుస్తకం నిలుస్తుందని ప్రముఖ పుస్తక సంపాదకురాలు స్వర్ణ కిలారి అన్నారు. ఐద్వా నాయకురాలు సావిత్రి అధ్యక్షతన శనివారం రాత్రి స్థానిక ఎన్జీఓ హోంలో ఇంతియానం 2.0 యాత్ర రచనల సంపుటిని ఆవిష్కరించారు. సాహితీ స్రవంతి, ఐద్వా సంయుక్తంగా నిర్వహించిన పుస్తకావిష్కరణ సభకు స్వర్ణ కిలారి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. చాలా మంది మహిళలు రచించిన యాత్ర రచనలకు వచ్చిన స్పందనతో రెండు సంకలనాల్లో వైవిధ్య యాత్రా నేపథ్యం, సాహసాలు ఉన్నాయని తెలిపారు. మహిళా సాధికారత ఉట్టిపడేలా సాగిన రచనను అందరూ చదవాల్సిన రచనగా మానవ హక్కుల వేదిక రాష్ట్ర నాయకులు చంద్రశేఖర్ అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రగతి, డాక్టర్ మేరీమాధురి, రమేష్ సుసర్ల, సంగీత వాణి నిర్వాహకులు అడవాల శేషగిరి నాయుడు, మానవత తరిమెల అమరనాథ రెడ్డి, డాక్టర్ ప్రసూన, జనప్రియ కవి ఏలూరు యంగన్న, షరీఫ్, డాక్టర్ రాధేయ, చెట్ల ఈరన్న, రియాజుద్దీన్, శశికళ, డాక్టర్ పల్లవి, సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు

**అనంతపురం:** నగరంలో పోలీసులు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు. ఆటోలు, టూ వీలర్లు, కార్లు, లారీలు, వ్యాన్లను ఆపి ఆయా డ్రైవర్లను బ్రీత్ అనలైజర్‌తో పరీక్షించారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఎట్టి పరిస్థితుల్లో మద్యం తాగి డ్రైవ్ చేయకూడదని తెలిపారు. వాహనదారులు ప్రయాణించేటప్పుడు రోడ్డు నిబంధనలను విధిగా పాటించాలని పేర్కొన్నారు.

### 'చిట్టీ కట్టించుకుని మోసం చేశారు'

**అనంతపురం:** అనంతపురం రూరల్ మండలం పాపంపేట, ఓటీఆర్‌లో నివాసం ఉంటున్న మారపరెడ్డి శివప్రసాద్ రెడ్డి, అతని భార్య, కుమారులు కలసి రూ.15 లక్షలు చిట్టీ కట్టించుకుని మోసం చేశారని బాధితురాలు సుజాత టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు.

# సెక్టోరియల్స్ వచ్చేస్తున్నారు..

- సమగ్రశిక్షకు ఇద్దరు సెక్టోరియల్ అధికారుల నియామకం
- జీసీడీఓగా కవిత, అసిస్టెంట్ ఏఎంఓగా ఫణిరాజు
- రేపు బాధ్యతలు స్వీకరించనున్న సెక్టోరియల్స్
- తక్కిన పోస్టులకు నోటిఫికేషన్ జారీకి సిద్ధం




**అనంతపురం ఎడ్యుకేషన్:** దాదాపు ఏడాదికి సమగ్రశిక్షకు ఇద్దరు కొత్త సెక్టోరియల్ అధికారులు రానున్నారు. బెళుగుప్ప మండలం గంగవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణితం టీచర్ కె.కవిత జీసీడీఓగా, డి.హీరేహాళ్ మండలం గుడిసెలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఎస్ టీచర్ ఎస్.ఫణిరాజు అసిస్టెంట్ ఏఎంఓగా నియమించారు. వాస్తవానికి వీరితో పాటు ఏఎంఓగా ఆనంద భాస్కర్‌రెడ్డి, అలెస్కోగా గురుమునికృష్ణ, అసిస్టెంట్ ఏఎంఓ (కన్నడ) రామగిరి కిష్టప్పను జిల్లా కమిటీ ఎంపిక చేసి కలెక్టర్ ఆమోదంతో కమిషనర్‌కు పంపారు. అయితే వీరిలో రామగిరి కిష్టప్పను మాత్రమే తప్పించి తక్కిన నలుగురికి ఆమోదం తెలుపుతూ ఈ ఏడాది ఫిబ్రవరిలో కమిషనర్ నుంచి ఉత్తర్వులు వచ్చాయి. కిష్టప్పతో పాటు ఓ మంత్రి సిఫార్సు చేసిన లేడీ టీచర్ పేరు లేకపోవడంతో ఆయన, ఇద్దరు ఎమ్మెల్యేలు గట్టిగా అడ్డుకున్నారు. ఏ ఒక్కటీ అమలు చేయొద్దని అన్నీ పెండింగ్ పెట్టాలంటూ అధికారులపై ఒత్తిడి చేయడంతో ఈ ప్రక్రియ అక్కడితో ఆగిపోయింది. ఆ తర్వాత కొద్ది రోజులకు అన్నింటినీ రద్దు చేసి కొత్త నోటిఫికేషన్ ఇవ్వాలంటూ కమిషనర్ నుంచి మరో ఉత్తర్వు వచ్చింది. జిల్లాకు చెందిన ఓ కీలక అధికారికి కోపం వచ్చింది. నిబంధనల ప్రకారం అర్హతలను బట్టి ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపిక చేశామంటూ ఆ అధికారి అసహనం వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఈ క్రమంలో నోటిఫికేషన్ జారీకి అనుమతి ఇవ్వలేదనే ప్రచారం సాగింది. ఎట్టకేలకు గతంలో తాము ఎంపిక చేసిన వారిని తీసుకోవాలని ఇంకా మిగిలి ఉంటే నోటిఫికేషన్ ఇద్దామని తెగేసి చెప్పారు. ఇదే సమయంలో ఏఎంఓగా నియామకం పొందిన ఆనంద భాస్కర్‌రెడ్డి తనకు ఆసక్తి లేదని రాతపూర్వకంగా లేఖ ఇచ్చారు. మరో టీచర్ గురుమునికృష్ణ హెచ్‌ఎంగా పదోన్నతి రావడంతో వెళ్లిపోయారు.

#### ఏడాది పాటు ఒకే ఒక్కరు

విద్యాశాఖకు అత్యంత కీలకమైన సమగ్ర శిక్ష కార్యాలయం చరిత్రలో ఏడాది పాటు కేవలం ఒక్కరంటే ఒకరు మాత్రమే సెక్టోరియల్ ఆఫీసర్ ఉన్నారు. పూర్వపు డీఈఓ, సమగ్రశిక్ష డీపీసీగా ఉన్న వరలక్ష్మి నిర్వాకంతో 2024 జూలై 31న నిబంధనలకు విరుద్ధంగా రాష్ట్రంలో ఏ జిల్లాలోనూ లేని విధంగా ఉన్న సెక్టోరియల్ ఆఫీసర్లందరినీ కట్టకట్టి మరీ రిలీవ్ చేశారు. అయితే తన చేతికి మట్టి అంటకుండా కలెక్టర్ తోనే ఈ తప్పు చేయించారు. ఆమె తీసుకున్న అసంబద్ధ నిర్ణయాలు జిల్లాలో సమగ్రశిక్షకు శాపంగా మారాయి.

దీంతో తక్కిన ఇద్దరు కవిత, ఫణిరాజు ఆసక్తి చూపడంతో వారిద్దరినీ రిలీవ్ చేస్తూ ఫారెన్ సర్వీస్ ఉత్తర్వులను డీఈఓ జారీ చేశారు. సోమవారం వారు విధుల్లో చేరనున్నారు. తక్కిన ఖాళీలకు వీలైనంత త్వరగా కొత్తగా నోటిఫికేషన్ జారీ చేస్తామని సమగ్రశిక్ష ఏపీసీ శైలజ తెలిపారు. కాగా.. నిబంధనల మేరకు తన నియామకం జరిగిందని, అకారణంగా తనను తప్పించడంపై రామగిరి కిష్టప్ప కోర్టుకు వెళ్లే యోచనలో ఉన్నారు.

## భోజనం రుచిగా లేకపోతే చర్యలు

- జిల్లా పరిషత్ సీఈఓ శివశంకర్



విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న జెడ్పీ సీఈఓ శివశంకర్

**రాప్తాడు:** మధ్యాహ్న భోజనం రుచిగా లేకపోతే చర్యలు తప్పవని జిల్లా పరిషత్ సీఈఓ శివ శంకర్, డీపీఓ నాగరాజు నాయుడు హెచ్చరించారు. ప్రతి నెల మూడవ శనివారం స్వర్ణ ఆంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. భోజనం ఎలా ఉందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు భోజనం వడ్డించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా పేద విద్యార్థులే అన్నారు. వారి కోసం ప్రభుత్వం నాణ్యమైన భోజనాన్ని అందించడానికి మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రవేశ పెట్టడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా లేకపోతే ఏజెన్సీ నిర్వాహకులు, ఉపాధ్యాయులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. విద్యార్థులు ప్రతి ఒక్కరూ తమ పుట్టిన రోజున ఒక మొక్కను నాటి, ఆ మొక్కకు సంరక్షించాలని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ విజయలక్ష్మి, ఈఓఆర్డీ ఆనంద్ ప్రసాద్, హెచ్‌ఎం రాజేశ్వరి ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## పారదర్శకంగా ఓటరు జాబితా



మాట్లాడుతున్న ఈఆర్‌ఓ రామ్మోహన్

**రాప్తాడు:** ఓటరు జాబితాను పారదర్శకంగా రూపొందించేలా చర్యలు చేపడుతున్నట్లు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఈఆర్‌ఓ) రామ్మోహన్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ జాబితాలో చేర్పులు, మార్పులు, తొలగింపులు, సవరణలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఆర్‌ఓ మాట్లాడుతూ.. ఓటర్ జాబితా కసరత్తుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి నిబంధనలు, చట్టాల్లో అవసరమైన మార్పు, చేర్పులకు రాజకీయ పార్టీల నుంచి సూచనలు స్వీకరిస్తున్నామన్నారు. ఓటర్ నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని చెప్పారు. అలాగే నోటీసు ఇచ్చిన తర్వాతే వివాహం అయ్యి మరొక గ్రామానికి వెళ్లిన వారు, మృతి చెందిన ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగిస్తామని స్పష్టం చేశారు. రెండు నియోజకవర్గాల్లో ఓటు హక్కు కలిగి ఉన్నవారిని గుర్తించి, వెంటనే తొలగించాలని బీఎల్‌ఓలకు ఆదేశాలిచ్చినట్లు వివరించారు. పోలింగ్ స్టేషన్ల రేషనలైజేషన్ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. భారత ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు జూలై 2వ తేదీన నియోజకవర్గంలోని బీఎల్‌ఓలకు అందరికీ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. గుర్తింపు పొందిన అన్ని పార్టీల నాయకులు తమ పార్టీల తరపున బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయకుమారి, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

### నేడు క్రికెటర్ల ర్యాలీ



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న దృశ్యం

**అనంతపురం:** కేంద్రం వెంటనే ఆర్టీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏ పునరుద్ధరణ చేయాలనే డిమాండ్‌తో ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ర్యాలీ నిర్వహిస్తున్నట్లు సీనియర్ క్రికెటర్ మచ్చా రామలింగా రెడ్డి తెలిపారు. శనివారం అనంతపురం జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యాలయంలో ర్యాలీకి సంబంధించిన పోస్టర్లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ర్యాలీ టవర్ క్లాక్ నుంచి ప్రారంభమై సప్తగిరి సర్కిల్, ఐరన్ బ్రిడ్జి, సంగమేష్ సర్కిల్ కార్యాలయం మీదుగా కలెక్టర్ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఏడీసీఏ జిల్లా సెక్రెటరీ భీమలింగా రెడ్డి, సీనియర్ క్రికెటర్లు ప్రసాద్ రెడ్డి, యుగంధర్ రెడ్డి, సురేష్, కమలాకర్ నాయుడు, చంద్రమోహన్ రెడ్డి, మురళి, విజయరాజు పాల్గొన్నారు.

## జీతాలు మంజూరు చేయాలి



ఉప ఖజానా అధికారి సీహెచ్ రాణికి వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

**అనంతపురం ఎడ్యుకేషన్:** బదిలీ పొందిన ఉపాధ్యాయుల కేడర్ స్ట్రెంత్ వివరాలు నవీకరించి జాప్యం లేకుండా జీతాలు మంజూరు చేయాలని ఎస్టీయూ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం జిల్లా ఉప ఖజానా అధికారి సీహెచ్ రాణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి రామాంజనేయులు మాట్లాడారు. పాఠశాలల పునర్విభజన ప్రక్రియలో భాగంగా ఉపాధ్యాయ పోస్టులను పునర్విభజన చేస్తూ ఉపాధ్యాయ, విద్యార్థి నిష్పత్తి ఆధారంగా పాఠశాలలకు పోస్టులు కేటాయించిందన్నారు. సాధారణ బదిలీలు, పదోన్నతుల వలన పునర్విభజన ద్వారా నూతనంగా ఏర్పడిన ఖాళీలకు జిల్లా వ్యాప్తంగా వందలాది మంది ఉపాధ్యాయులు వెళ్లినట్లు తెలిపారు. పోస్టుల పునర్విభజన దృష్ట్యా డీడీ ఓ పరిధిలో మారిన కేడర్ స్ట్రెంత్‌కు అనుగుణంగా సీఎఫ్‌ఎంఎస్‌లో పొజిషన్ ఐడీలను మార్పు చేస్తే గాని వారికి జీతాలందని పరిస్థితి నెలకొందన్నారు. వెంటనే సీఎఫ్‌ఎంఎస్‌లో పొజిషన్ ఐడీలను మార్పు చేసి జూన్ నెల జీతాలు అందేలా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్టీయూ నాయకులు సూర్యుడు, కె.చంద్రశేఖర్, రాజశేఖర్, మల్లికార్జున, రవి, రామకృష్ణ, నారాయణ స్వామి, సుధాకర్, సంజప్ప, మల్లికార్జున, రమేష్ పాల్గొన్నారు.

## యోగాంధ్రలో అనంతవాసులు




ధ్రువపత్రాలను చూపుతున్న విజేతలు

**అనంతపురం అర్బన్:** విశాఖపట్నంలో శనివారం నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమానికి యోగా విజేతలు హాజరయ్యారు. రాష్ట్రస్థాయి యోగాంధ్ర-25 పోటీల్లో వివిధ కేటగిరీల్లో బహుమతులు సాధించిన జిల్లావాసులు భావన రసజ్ఞ, చలపతి, విజయభాస్కర్ చౌదరి, సునీత, వర్ష బృందం, ప్రశాంత్, మోహిత్, మోక్షిత, అయుష్మంత్, భరణి, సాయి చంద్రశేఖర్, రుషిత తన్మయి పాల్గొన్నారు. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి యోగా కార్యక్రమంలో ఒకే గ్రిడ్‌లో కొందరు, పక్కన ఉన్న గ్రిడ్‌లో మరికొంత మంది పాల్గొని యోగా చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న వారికి ధ్రువపత్రాలను అధికారులు అందజేశారు. కార్యక్రమంలో ఎన్‌టీఆర్ వైద్యసేవ జిల్లా కో-ఆర్డినేటర్ కిరణ్ కుమార్‌రెడ్డి, జిల్లా ఆయుష్ అధికారి భాస్కర్ రావు పాల్గొన్నారు.

## బుచ్చయ్యా.. నోరు అదుపులో పెట్టుకో



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

**అనంతపురం టవర్‌క్లాక్:** ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి నోటికి ఎంత వస్తే అంత మాట్లాడుతున్నారు. నోరు అదుపులో పెట్టుకుని మాట్లాడితే మంచిదని వైఎస్సార్‌సీపీ రాప్తాడు నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు సీపీ ఓబులేసు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి తల నరుకుతాం.. జీవించే అర్హత లేదంటూ అధికార మదంతో బుచ్చయ్య చౌదరి మాట్లాడటం సరికాదన్నారు. చంద్రబాబు, లోకేష్ దృష్టిలో పడేందుకు ఆయన వ్యాఖ్యలు చేస్తున్నట్లు తెలిపారు. ఒక ఎమ్మెల్యే స్థానంలో నరుకుతా అనడం, రౌడీలా మాట్లాడటం చూస్తుంటే కూటమి ప్రభుత్వ పాలన ఎలా ఉందో అర్థం అవుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ అభిమానులు ఫ్లెక్సీపై రప్పా, రప్పా అని కోటేషన్లు వేయిస్తేనే రచ్చ రచ్చ చేస్తున్నారన్నారు. మా అధినేతపై వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బుచ్చయ్య చౌదరిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎస్సీ సెల్ నగర అధ్యక్షుడు సాకే శివ శంకర్, ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి లబ్బె రాఘవ పాల్గొన్నారు.

# డ్రైనేజీ అస్తవ్యస్తం

- రాప్తాడు పంచాయతీ ముస్లిం మైనార్టీ కాలనీలో ముందుకు కదలని మురుగు
- ఇబ్బందులు పడుతున్న కాలనీ వాసులు
- ప్రబలుతున్న వ్యాధులు
- పట్టించుకోని పాలకులు, అధికారులు



డ్రైనేజీలో ముందుకు కదలని నీరు

**రాప్తాడు:** రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీలో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. గ్రామంలో అక్కడక్కడా సీసీ రోడ్లు నిర్మించినా.. వాటికి డ్రైనేజీలు ఏర్పాటు చేయకపోవడంతో మురుగు సీసీ రోడ్లపైనే పారుతోంది. కాలనీలో మురుగు వెళ్లేందుకు ఒక పెద్ద కాలువ ఉన్నా.. మురుగు ముందుకు కదలడం లేదు. దోమలు వృద్ధి చెందడంతో ప్రజలు డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర జ్వరాలతో పాటు అతిసార వ్యాధుల బారిన పడుతున్నారు. కనీసం దోమల నివారణకు ఒక్కసారి కూడా ఫాగింగ్ చేపట్టిన దాఖలాలు లేవు. పారిశుధ్యం మెరుగుపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. క్షేత్రస్థాయిలో వ్యాధులపై అప్రమత్తం చేయాల్సిన అధికారులు ఆ దిశగా అవగాహన కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారు.

**మురుగు కాలువ కబ్జా..**

ముస్లిం మైనార్టీ కాలనీలోని మొదటి వీధిలో కాలనీలోని మురుగు వెళ్లేందుకు పెద్ద కాలువ ఏర్పాటు చేశారు. కాలనీలోని మురుగు నీరంతా మొదటి వీధిలోని పెద్ద కాలువ దగ్గరికి చేరుకుంటుంది. అక్కడి నుంచి టీటీడీసీ కార్యాలయం మీదుగా ప్రజ్ఞ క్యాన్సర్ ఆసుపత్రి, ఏపీ మోడల్ స్కూల్ హాస్టల్ మీదుగా, ఏపీ సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కాంపౌండ్, ధర్మవరం, కదిరి జాతీయ రహదారి దాటుకుని పాలవేరు వీర నాగమ్మ గుడి సమీపంలో ట్రాన్స్‌కో సబ్‌స్టేషన్ మీదుగా పండమేరు వంకలోకి మురుగు చేరాల్సి ఉంటుంది. అయితే ముస్లిం మైనార్టీ కాలనీ దాటిన తర్వాత టీటీడీసీ కార్యాలయ సిబ్బంది మురుగు కాలువ లేకుండా పూడ్చివేశారు. వారితో పాటు ప్రజ్ఞ క్యాన్సర్ ఆసుపత్రి వద్ద కూడా కాలువ ఆనవాళ్లు కూడా కనిపించవు. అక్కడి నుంచి ఏపీ మోడల్ హాస్టల్ ముందు కూడా వెంచర్లు వెలిశాయి. వెంచర్లు వేసినా వారు కూడా కాలువను పూడ్చివేసి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. సెయింట్ విన్సెంట్ డీపాల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల కాంపౌండ్ పక్కనే కాలువ ఉన్నా.. ఆ కాలువను కూడా కొందరు స్వార్థపరులు పూడ్చి వేసి ఇళ్లు, షాపులు నిర్మించారు. కదిరి, ధర్మవరం జాతీయ రహదారి కింద మురుగు నీరు వెళ్లేందుకు ఆర్‌అండ్‌బీ అధికారులు మోరీ కూడా ఏర్పాటు చేశారు. అయినా స్వార్థపరులు మురుగు కాలువను కూడా కబ్జా చేయడంతో మురుగు ముందుకు వెళ్లకుండా కాలనీ సమీపంలోనే నిల్వ ఉంటోంది.

**విష పురుగుల సంచారం..**

మురుగునీటి సమస్యపై పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ప్రయోజనం లేకపోయింది. మరో పక్క కాలనీలో వీధి లైట్లు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో రాత్రి 6 గంటలైతే బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది. విష పురుగులు సంచరిస్తుండటంతో భయాందోళన చెందుతున్నారు. కాలనీలో వీధిలైట్లు ఏర్పాటు చేయాలని పలుమార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు చెబుతున్నారు.

## యోగాతో ఆరోగ్య భాగ్యం



ఎన్‌వైకే ఆధ్వర్యంలో యోగా సాధన



రాప్తాడులో యోగా చేస్తున్న అధికారులు



అనంతపురంలో విద్యార్థినుల యోగా సాధన

**రాప్తాడు:** యోగా దిన చర్యలో ఒక భాగంగా మారితే ఇంటిల్లిపాదికీ ఆరోగ్యం సొంతమవుతుందని నియోజకవర్గ ప్రత్యేకాధికారి రామ్మోహన్, ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ విజయకుమారి అన్నారు. శనివారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా రాప్తాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. యోగాసనాలు చేయడం ద్వారా క్రమశిక్షణ, మెరుగైన జీవన విధానం అలవడుతుందన్నారు. యోగా సాధనతో మానసిక సమస్యలకు, శారీరక రుగ్మతల నుంచి విముక్తి లభిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ మల్లికార్జున, ఈఓఆర్డీ ఆనంద ప్రసాద్, మండల స్థాయి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**అనంతపురం కల్చరల్:** నెహ్రూ యువకేంద్రం, జన శిక్షణ సంస్థ, పతంజలి యోగా కేంద్రం ఆధ్వర్యంలో 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. నిత్యజీవితంలో యోగాను ఒక భాగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్‌వైకే ప్రోగ్రాం ఇన్‌చార్జి గోవర్ధన శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ డాక్టర్ కేసీ సత్యలత, జనశిక్షణ సంస్థ డైరెక్టర్ సౌదాగర్, పతంజలి యోగా మహేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు. అలాగే సాయిట్రస్టు ఆధ్వర్యంలో వృత్తి శిక్షణ కేంద్రం, బ్రాహ్మణ సంఘం కార్యాలయంలో యోగా దినోత్సవ వేడుకలు జరిగాయి.

### విద్యార్థి అదృశ్యం



పునీత్ కుమార్ (ఫైల్)

**రాప్తాడు:** ప్రసన్నాయపల్లి పంచాయతీలోని కళాకారుల కాలనీకి చెందిన బాదుల్లా, తులసి దంపతుల కుమారుడు పునీత్ కుమార్ అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు సీఐ టీవీ.శ్రీహర్ష తెలిపారు. వివరాలు.. బాదుల్లా గుజిరి వ్యాపారం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. కుమారుడు పునీత్ కుమార్ ప్రసన్నాయపల్లిలోని వినయ్‌కుమార్ ఎయిడెడ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన విద్యార్థి సాయంత్రం ఇంటికి తిరిగి చేరుకోలేదు. కుటుంబ సభ్యులు గాలించినా విద్యార్థి ఆచూకీ లభ్యం కాకపోవడంతో శనివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఘటనపై మిస్సింగ్ కేసు నమోదు చేసి, గాలింపు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. ఆచూకీ తెలిస్తే 9440796817 నంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

### పేకాట రాయుళ్ల అరెస్ట్

**రాప్తాడు:** హంపాపురం సమీపంలోని ఆదరణ పాడి పంట వ్యవసాయ క్షేత్రం సమీపంలో ఓ రైతు వ్యవసాయ తోటలో పేకాట ఆడుతున్న 7 మంది పేకాట రాయుళ్లను శనివారం పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి నుంచి రూ.1,00,700 నగదు, మొబైల్స్, ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు. పేకాట రాయుళ్లంతా అనంతపురం రూరల్ మండలం ఆకుతోటపల్లికి చెందిన వారని పేర్కొన్నారు. పేకాట రాయుళ్లను అరెస్ట్ చేసిన సిబ్బందిని సీఐ అభినందించారు.

### మద్యం విక్రేత అరెస్ట్

**రాప్తాడు:** ప్రసన్నాయపల్లి పంచాయతీలోని అయ్యవారిపల్లి గ్రామంలో శనివారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న తలారి నాగరాజును చేసినట్లు సీఐ శ్రీహర్ష తెలిపారు.

### ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల ఔదార్యం

**అనంతపురం కార్పొరేషన్:** మృతి చెందిన తోటి కార్మికుడికి ఇంజనీరింగ్ విభాగం ఔట్‌సోర్సింగ్ సిబ్బంది తమ ఒక్క రోజు వేతనాన్ని అందించి ఔదార్యాన్ని చాటుకున్నారు. వివరాలు.. మూడు నెలల క్రితం నీటి సరఫరా విభాగంలో పని చేసే నారాయణ అనే వ్యక్తి ఆకస్మికంగా మృతి చెందారు. ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ కలసి తమ ఒక్క రోజూ వేతనం ఇవ్వడానికి ముందుకువచ్చారు. సేకరించిన రూ.1,20,500 మొత్తాన్ని శనివారం నగరపాలక సంస్థలో కమిషనర్ బాలస్వామికి అందజేశారు.

### సకాలంలో వ్యాక్సినేషన్‌కు చర్యలు



డాక్టర్ రవిబాబు, ఏడీడీఎల్ ఏడీ

**అనంతపురం అగ్రికల్చర్:** పశుసంరక్షణ, జీవ సంరక్షణ లక్ష్యంగా సీజనల్, అంటువ్యాధులు ప్రబలకుండా సకాలంలో వ్యాక్సినేషన్ కార్యక్రమాలు జరిగేలా చర్యలు తీసుకుంటామని స్థానిక పశువ్యాధి నిర్ధారణ కేంద్రం (అనిమల్ డిసీజస్ డయాగ్నస్టిక్ ల్యాబ్-ఏడీ డీఎల్) అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ రవిబాబు తెలిపారు. బదిలీల్లో భాగంగా ఇక్కడ పని చేస్తున్న ఏడీ డాక్టర్ ఎస్.రామచంద్ర కర్నూలుకు, అక్కడ పని చేస్తున్న డాక్టర్ రవిబాబు ఇక్కడికి బదిలీ అయ్యారు. శనివారం స్థానిక సాయినగర్ కార్యాలయంలో ఆయన బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం జేడీ డాక్టర్ జీపీ వెంకటస్వామిని కలిశారు. ఈ సందర్భంగా నూతన ఏడీ డాక్టర్ రవిబాబు మాట్లాడుతూ.. పశువులు, జీవాలు, కోళ్లకు వచ్చే గొంతువాపు, చొప్పవాపు, చిటుకురోగం, దొమ్మరోగం, ఈసుడు వ్యాధి, , బొబ్బరోగం, కొక్కెర తెగుళ్లు, పారుడురోగం, నీలినాలుక వ్యాధి, గాలికుంటు వ్యాధి, బ్రూసెల్లోసిస్, డీవార్మింగ్ తదితర వాటికి సంబంధించి క్రమం తప్పకుండా ఉచిత టీకాలు వేయడం జరుగుతుందన్నారు. సకాలంలో టీకాలు తెప్పించి జేడీ ఆదేశాల మేరకు పశుశాఖ బృందాల ద్వారా గ్రామ గ్రామాన వ్యాక్సినేషన్లు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వ్యాధి నిర్ధారణ కేంద్రాలను బలోపేతం చేసి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందిపుచ్చుకుని జిల్లాలో పశు, జీవ సంరక్షణకు పని చేస్తామన్నారు.